# ఆడతనం

వి.ఎం.ఎస్. స్వాతి

సాగరిక ఈ మధ్య సరిగ్గా భోజనం చేయడంలేదు. ఎప్పుడు చూసినా పరాకుగా ఉంటోంది. రాత్రులూ చాలా పొద్దుపోయే వరకు గదిలో లైటుంచుతూ ఉంది.

ఈ రాత్రి కూడా చాలా పొద్దుపోయే వరకు కూతురి గదిలో లైటు వెలుగుతూనే వుంది. అంటే సాగరిక మేల్కొని ఉన్నట్లేగా... అందునా ఫైనల్ బి.కాం. ఈ మూడ్‌లో చదువుమీద ఏం శ్రద్ధ కనపరుస్తూందో...ఇలాగైతే డిగ్రీ గట్టెక్కినట్టే...'

భర్త నిద్రపోయాక మెల్లగా లేచి కూతురు గదిలోకి నడిచింది అంజలి. మంచం మీద పడుకొని కిటికీలోంచి కనిపిస్తున్న నీలాకాంశంలోకి నిరామయంగా చూస్తోంది సాగరిక.

తల్లి తలుపులు తోసుకొని లోపలికొచ్చిన అలికిడే వినిపించుకోలేదంటే ఇహాన్ని మరిచి అంత దీర్ఘాలోచనలో ఉందన్నమాట... పైన చెయ్యి పడ్డంతోనే ఉలిక్కిపడి చూసింది.

'నేనూ!' అన్నట్లుగా చిన్నగా మందహాసం చేసింది అంజలి.

'ఏమ్మా! ఇంకా నిద్రపోలేదా? టేబుల్ ల్యాంప్ వెలుగుతూనే ఉంది. పుస్తకాలు తెరిచినవి తెరిచినట్లే ఉన్నాయి. తల నొప్పిగా ఉందా? పరీక్షలు దగ్గర్లోనే ఉన్నాయనే కదూ, మొన్నోమారు చెప్పినట్లు గుర్తు...' తుఫాను ముందు ప్రశాంతతను ప్రదర్శించింది.

ఇలా తను ఎదుట పడ్డమే తరవాయి 'మమ్మీ యూ స్వీట్ ...' అంటూ కూతురు తన మెడను కౌగలించుకొని పదే పదే బుగ్గల్ని ముద్దాడేది మునుపట్లో అయితే.

ఇప్పుడలా కౌగలించుకోలేదు సరికదా, చనువుగా చెయ్యి పట్టుకోను కూడా లేదు. ముభావంగా లేచి కూర్చుని 'ఊ!' 'ఆ!' సనుగుళ్ళతో గిల్టీగా తన కేసి ఓ మారు చూసి తల దించుకొంది.

కూతుర్ని దారికి తీసుకురావడానికి కోపం మార్గం కాదని బలవంతాన ఆవేశాన్ని నిగ్రహించుకున్నది.

'ఓహ్హో! ఎదిగిపోయావని కాబోలు- అయితే మాత్రం ఇలా ఉండాలని రూలెక్కడుంది? ఒక వేళ ఎవరినయినా ప్రేమించిందేమో...'

ఆలోచనలు అక్కడ్నుంచి కొనసాగించేందుకు ఇష్టపడలేదు అంజలి.

'ప్రేమ విషయం ఈ కాలం పిల్లలకేం తెలుసు—

పరస్పరం కొంటెగా చూసుకోవడం, మరీ చపలత్వం ఉంటే ఆ 'ముచ్చట' తీర్చుకోవడం, అంతేగా! పెళ్ళిదాకా వచ్చే ప్రేమికుల శాత మెంత?'

నిట్టూరుస్తూ చిరాగ్గా మదురు రుద్దుకుంది అంజలి.

ఒక వేళ కూతురే గనుక అలా ఎవర్నయినా ఆరాధిస్తూన్న పక్షంలో ఆ పరిచయాన్ని మొదలంటా తుంచెయ్యాల్సిందే! అని ఓ నిర్ణయానికి వచ్చింది అంజలి.




సాధ్యమైనంత మార్దవాన్ని గొంతులో మేళవిస్తూ "రెండు వారాలబట్టీ గమనిస్తున్నాను. మునుపటి కళాకాంతులు, హుషారు నీలో సన్నగిల్లాయి. ఒంట్లో ఏమైనా బావుండడం లేదా, చెప్పమ్మా? చిన్నపిల్లవు, ఇప్పుడే మన్నుతిన్న పాములా తయారైతే, రేపు పెళ్లయి పిల్లా జెల్లల్ని కళ్ళ చూడాలి. కట్టుకున్నవాడు ఇలా ముంగిగా ఉంటే ఊరుకుంటాడా? చెప్పు సారికా! నీ బాధ ఏమిటమ్మా? నా తల్లివి కదూ, మీ మమ్మీకి చెప్పకోకుంటే ఎలాగమ్మా?" కూతురు తల నిమురుతూ మాట్లాడ్తూనే ఉంది.

అంతవరకూ స్తబ్దుగా ఉన్న సాగరికలో ఒక్కసారిగా చలనం కలిగి బెడ్ షీట్ దిగువ కనిపించీ, కనిపించనట్లున్న ఏదో పుస్తకాన్ని దాచేసే ప్రయత్నంలో పడింది.

అది కాస్తా తల్లి కంట పడనే పడింది. "సాగరికా! ఏమిటమ్మా అది..." అంటూ పుస్తకం అందుబాటులోనే ఉండడంతో కూతురు అందుకొనే లోపలే ఒడుపుగా దాన్ని చేజిక్కించుకుంది. అది డైరీ!

కొన్ని పంక్తులు అంతక్రితమే రాసినట్లు అక్షరాలు తళతళలాడ్తున్నాయి.

"మమ్మీ! ప్లీజ్, అదిటివ్వు..." కూతురు డైరీని లాక్కొని చూసినా, "ఉండు, ఇవ్వక నేనేం చేసుకుంటాను..." అని కసురుతూ పంక్తులు సాంతం చదివికానీ డైరీని వదలలేదు.

"ఆ అబ్బాయెవరో కానీ, నువ్వు ఆడపిల్లవే కావు అన్నాడనుకో! ఆ మాత్రానికే ఇలా కుమిలిపోవాలా పిచ్చిపిల్లా? ఇదేనా ఇన్నాళ్ళు నీ దిగులుకు కారణం? ఇంకా ఏమేం జరిగిందోనని హడలి ఛస్తున్నాను. ఈడేరిన ఆడపిల్ల ఎప్పుడూ కుర్రాళ్ళకేసి తేరిపార చూడకూడదు, నవ్వకూడదు. అలా చేసినవాడు వారి వైపుకు మొగ్గినట్లే అర్థం! నువ్వా చేష్టలకు దూరంగా ఉన్నావనేనమ్మా, అతను నిన్ను ఉడికించాలని అలా అన్నది. తల్లిని నాకు చెప్పుకోకుంటే నీ గుండెల్లో గూడు కట్టుకొన్న ఈ దిగులు ఎలా పోతుందనుకున్నావు..."

అసలు విషయమేమిటో తను చెప్పకుండానే తల్లే తెలుసుకుని, మంచి చెడ్డలు వివరిస్తుంటే, ఇన్నాళ్ళుగా కోల్పోయిన హుషారు, చొరవ సాగరికలో సరికొత్తగా పుంజుకున్నట్లయి, తల్లి మెడను గాఢంగా వాటేసుకొంది. పూర్వంలా ఆమె బుగ్గల్ని ముద్దాడుతూ, నంగినంగిగా మాట్లాడసాగింది.

"నే నెక్కువగా మగవారి డ్రెస్‌లే వేస్తుంటానా, ఆ మాత్రానికే నా ఆడతనం లేకుండా ఎక్కడికి పోతుందమ్మా? మగవాళ్ళను నేనసలే కేర్ చెయ్యను. అందుకే ఆ రాస్కెల్ అంత మాటన్నాడు. అప్పటి నుంచీ అవమానంగా ఫీలై భోంచేయలేకపోతున్నాను. నిద్దే రావడంలేదు. అసలు మమ్మీ! శారీ కట్టుకొని, జడ బిగుతుగా వేసుకుని, నలుగుర్లో ఒదిగొదిగి మసలుకుంటేనేనా ఆడతనం ఉన్నట్లు..." తను అనుకున్న దొకటి, చివరికి జరిగిందొకటి అయ్యేసరికి— "ఇందులో నీ తప్పు ఏ కోశానా లేదమ్మా! మంచిపిల్లవు కాబట్టే ఇలా ఆలోచించగలుగుతున్నావు..." అంటూ మరికాసేపు కూతురికి నచ్చచెప్పి—ఆ గదిలోకి వచ్చే ముందున్న టెన్షన్ పూర్తిగా సడలిపోగా, ఆనందంగా బయటికి నడిచింది అంజలి. ●